మహిళా దినోత్సవం
సాక్షి
జనగామ
రేపటికి ముందడుగు
శుక్రవారం | 8 | మార్చి | 2024

న్యూస్‌రీల్

సమన్వయంతో పనిచేయాలి



రఘునాథపల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా కేంద్ర సాయుధ బలగాలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు కేటాయించిన కేంద్ర 58వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సిబ్బందితో ఆయన మాట్లాడి పలు సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్ యాదవ్, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

వివరాల నమోదు పకడ్బందీగా చేపట్టాలి



జనగామ రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో వివరాల నమోదు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన' నమోదు సెంటర్‌ను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుల్లో వివరాలు తప్పుగా ఉన్నవారు సవరించుకోవడానికి సంబంధిత పత్రాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గృహలక్ష్మి, మహాలక్ష్మి లబ్ధిదారులతో పాటు అధికారులను దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు రాణిస్తున్నారు



లింగాలఘణపురం : నేడు సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని డీఆర్‌డీఏ మొగిలప్ప అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో గురువారం స్థానిక శుభాంజలి మండల సమాఖ్యలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా చిన్నప్పటి నుంచే ఇళ్లలో తమ పిల్లలను ఆడ, మగ అనే తేడా లేకుండా పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, ఎంపీపీ జయశ్రీ, ఏపీఎం శంకరయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు సంధ్య, అరుణ, రేణుక, సీసీలు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీమతి, వెంకట్, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రేమానురాగాలకు మరోరూపం మహిళ

సీజేఐటీ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి



జనగామ: ప్రేమ, ఆప్యాయత, అనురాగానికి మరోరూపం మహిళ అని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ఫాదర్, డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో 'పవర్ ఆఫ్ ఉమెన్–మహిళా సాధి కారత' అనే అంశంపై గురువారం సీజేఐటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు మగ వారితో సమానంగా రాణిస్తూ తమలోని ప్రతిభను ప్రదర్శిస్తున్నారని చెప్పా రు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆత్మ విశ్వాసంతో ప్రతీ రంగంలో అడుగిడుతూ రాణించే విధంగా ప్రయత్నం చేస్తే విజయం వరిస్తుందన్నారు. కళాశాల మహిళా ప్రొఫెసర్లు సరిత, శ్రీజ, స్వప్న ప్రసంగించిన అనంతరం వారిని డైరెక్టర్, ప్రిన్సిపాల్ అభినందించారు. ప్రొఫెసర్లు సంతోషకుమారి, విద్యార్థినులు మౌనిక, సుష్మ తదితరులు పాల్గొన్నారు.


85 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలకు 85 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల కన్వీనర్ బైరీ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 3,588 మంది విద్యార్థులకు 3,503 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. స్టేషన్‌ఘన్‌పూర్ మోడల్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్లను శ్రీనివాస్, దేవరుప్పుల, కొడకండ్ల కళాశాలలను డెక్ సభ్యులు ఆంజనేయ రాజు, శేఖర్, జనగామ, నర్మెట కళాశాలలను ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు సందర్శించారు.

ఇంకా భయమే..

షాపింగ్ కూడళ్లు, బస్టాండ్ల వద్ద టీజింగ్

- నడుచుకుంటూ వెళ్తుంటే కామెంట్ చేస్తున్నారు
- 'సాక్షి' క్విక్ సర్వేలో నగర విద్యార్థినులు, యువతుల మనోగతం





ఒంటరిగా ఆడపిల్ల బయటికి వెళ్లాలన్నా.. భయమే. ఎవరైనా అమ్మాయిలు నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు ఆకతాయిలు కామెంట్ చేయడం, బైక్‌లతో వెకిలిచేష్టలు చేయడం చూస్తునే ఉన్నాం. పలుమార్లు షీటీమ్ పోలీసులు ఆకతాయిలు, ఈవ్‌టీజర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా నగరంలో టీజింగ్ కొనసాగుతోంది. కొన్ని కాలేజీల వద్ద, బస్టాండ్, షాపింగ్ సెంటర్ల వద్ద పోకిరీలు అడ్డా వేసి వచ్చిపోయే వారిని వెకిలి చేష్టలు, కామెంట్లు చేస్తున్నారు. ఈ అంశంపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యంలో క్విక్ సర్వే చేసింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో 50 మంది విద్యార్థినులు, యువతుల అభిప్రాయాలను సేకరించింది. ముఖ్య సెంటర్లు, బస్టాండ్ల వద్ద పోకిరీల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని, ఒంటరిగా ఆడపిల్లలు బయటికి వెళ్లలేని పరిస్థితి ఉందని మెజారిటీ యువతులు వెల్లడించారు.

- కాజీపేట అర్బన్

ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి



కళాశాల నుంచి ఇంటికి వెళ్తున్నప్పుడు, షాపింగ్‌కు వెళ్తున్న సమయంలో రహదారులపై ఆకతాయిల ఆగడాలు పెరిగిపోయాయి. బైక్‌పై ఒక్కసారిగా దూసుకు వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నడుచుకుంటూ వెళ్తుంటే అసభ్యకరమైన పదజాలంతో రెచ్చిపోతుంటారు. వీరిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి.

- పి.శృతి, విద్యార్థిని

షీ టీమ్స్ ఏర్పాటు చేయాలి



షీ టీమ్స్‌ను కళాశాల, బస్టాండ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారు షీ టీమ్స్ ఉంటాయనే భయంతో ఉన్నప్పుడే మహిళలు, బాలికలు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంటుంది.

- ప్రహర్ష శ్రీ, విద్యార్థిని

సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఇవ్వాలి



విద్యార్థినులకు, ఉద్యోగం చేసే మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ అందజేయాలి. టీజింగ్‌కు పాల్పడే వారిని ఎదిరించే విధంగా తీర్చిదిద్దాలి. తల్లిదండ్రుల మాదిరిగా విద్యార్థులకు రక్షణ కల్పించాలి. ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ టీంలను ఏర్పాటు చేయాలి.

- నిఖిల, విద్యార్థిని

వనితరర సాధ్యులు

- వంటింటి నుంచి రైలు నడిపే వరకు
- వివిధ రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలు
- వ్యవసాయంలోనూ అందెవేసిన చేయి..
- భర్త మరణించినా కుటుంబ భారం మోస్తూ..
- ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న మహిళా మణులు

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళ అంటే వంటింటికే పరిమితమన్న స్థాయినుంచి రైలును తాము కూడా నడపగలమని నిరూపించారు అతివలు. పురుషులకు దీటుగా వివిధ రంగాల్లో రాణిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. భర్త చనిపోయినా గుండె నిబ్బరం చేసుకుని వ్యవసాయ రంగంలో కొందరు.. వంశపారంపర్య వృత్తిలో మరికొందరు.. తమదైన ముద్ర వేసి పిల్లలను పెంచి ప్రయోజకులను చేశారు. నేడు (శుక్రవారం) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కుటుంబ భారాన్ని మోసి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న పలువురు మహిళల సక్సెస్ కథనాలు మీకోసం..

మొక్కవోని ధైర్యంతో ముందడుగు



తరిగొప్పుల: భర్త మరణించినా అధైర్యపడలేదు. చేతుల్లో నాలుగేళ్ల కూతురు, కడుపులో మరొక బిడ్డ. కట్టుకున్న వాడు ఇక తోడులేడన్న బాధను తనలోనే దాచుకొని పిల్లల భారాన్ని తనపై వేసుకొని జీవితంలో ముందుకు సాగుతోంది జనగామ జిల్లా తరిగొప్పుల మండలకేంద్రానికి చెందిన బూస అరుణ. భర్త బూస నర్సింహులు తదనందరం ఆమెకున్న ఎనిమిది ఎకరాల్లో 25 సంవత్సరాలు వ్యవసాయం చేస్తూ ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు చదివించింది. పెద్ద కూతురు కల్పన 7 ఏళ్ల క్రితం విద్యుత్ శాఖలో ఏఈగా ఉద్యోగం సాధించింది. చిన్న కూతురు నవ్య అగ్రికల్చర్‌లో బీఎస్సీ పూర్తి చేసింది. భర్త లేకపోయినా మొక్కవోని ధైర్యంతో వ్యవసాయరంగంలో రాణిస్తూ కూతుళ్లను ఉన్నత శిఖరాలకు చేర్చి అరుణ అందరికీ ఆదర్శమే.

ధైర్యంగా రైలు నడుపుతున్నా..



డోర్నకల్: పురుషులతో సమానంగా రైలు నడపడం గర్వంగా ఉంది. మహబూబాబాద్‌కు చెందిన నేను బీటెక్(ఈసీఈ) చదివి 2021 జూలైలో అసిస్టెంట్ లోకో పైలట్ ఉద్యోగానికి ఎంపికై మూడు నెలల శిక్షణ తర్వాత డోర్నకల్ జంక్షన్ పరిధిలోని క్రూ పాయింట్‌లో అసిస్టెంట్ లోకో పైలట్‌గా విధుల్లో చేరాను. ఏ సమయంలో కాల్ వచ్చినా విధులకు వెళ్లి లోకో పైలట్‌తో కలిసి రైలును నడుపుతున్నా.


- డి.శశిరేఖ, రైల్వే సీనియర్ అసిస్టెంట్ లోకో పైలట్, డోర్నకల్ రైల్వే జంక్షన్

20 ఏళ్లుగా ఫొటోగ్రఫీలో..



కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని నిరుపేద కూలీ కుటుంబానికి చెందిన రాజేశ్వరికి తన 14వ ఏట పస్తం రాజేశ్‌తో వివాహం జరిగింది. భర్త రాజేశ్ ఫొటోగ్రాఫర్‌గా మంచి పేరుంది. ఆమె కూడా భర్తతో కలిసి ఫొటోగ్రఫీ నేర్చుకుంది. ఉన్నట్టుండి రాజేశ్ పక్షవాతానికి గురై కొన్నేళ్ల పాటు మంచానికే పరిమితమై రెండున్నర ఏళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటివరకు సంతోషాల మధ్య ఉన్న ఆమె కుటుంబాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన చేసింది. సరదాగా నేర్చుకున్న ఫొటోగ్రఫీనే వృత్తిగా ఎంచుకొంది. 20 ఏళ్లుగా పురుషులతో సరిసాటిగా ఇన్‌డోర్‌తోపాటు ఔట్‌డోర్‌లో అందమైన ఫొటోలు తీస్తూ ఈ రంగంలో తనదైన ముద్ర వేసుకుంది.

'సాగు'మంతురాలు



పెద్దవంగర: కట్టుకున్నోడు ఏడేళ్ల క్రితం కాలం చేసినా దుఃఖాన్ని దిగమింగి నమ్ముకున్న భూమిలో సిరుల పంట పండిస్తోంది మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రామచంద్రుతండాకు చెందిన జాటోతు అనూష. ఆమెకు రెండున్నర ఎకరాల సాగు భూముంది. భర్త లేకపోవడంతో ఉపాధిగా వ్యవసాయాన్నే నమ్ముకుంది. వరి, కూరగాయలు పండిస్తోంది. తాజా కూరగాయలను తొర్రూరు, కొడకండ్ల, తిరుమలగిరి, పాలకుర్తి మండలాల్లో విక్రయించి కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. అక్షర జ్ఞానం లేని గిరిజన మహిళ పంటలతో వచ్చిన మొత్తంతో కూతురు ఝాన్సీ ఏడో తరగతి, 12ఏళ్ల కుమారుడు వినయ్‌కుమార్‌ను ఆరో తరగతి చదివిస్తూ స్వశక్తితో ముందుకు వెళ్తోంది.

స్తంభమెక్కి.. లైన్ కలిపి..



హన్మకొండ: వరంగల్ నగరంలోని గిర్మాజీపేటకు చెందిన జక్కోజి రాజేశ్వరి ఐటీఐ చదివింది. ట్రాన్స్‌కో లైన్‌మెన్ పోస్టులు పడగా దరఖాస్తు చేసింది. మొదట విద్యుత్ స్తంభం ఎక్కడంలో శిక్షణ తీసుకుంది. చివరకు ట్రాన్స్‌కో టవర్ క్లైంబింగ్ టెస్ట్ పెడితే నెగ్గింది. ఆమెకు లైన్‌మెన్ ఉద్యోగం రావడంతో ఆ కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. పురుషులే చేయగలరు అన్నదానిని రూపుమాపి తామూ స్తంభమెక్కుతాం అని నిరూపించింది రాజేశ్వరి. 'సంప్రదాయాలు జీవితం ఎదుగుదలకు అడ్డు కారాదు' అని ఆమె అంటోంది.

చెప్పులు కుడుతూ కుటుంబ పోషణ



స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన దేవరకొండ అరుణ అనే నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ చెప్పులను కుట్టే పనిచేస్తూ కుమారుడిని ఉన్నత చదువులు చదివించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది. అరుణ భర్త శంకరయ్య పదిహేనేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారం ఆమెపై పడింది. భర్త చనిపోయిన బాధను దిగమింగుకుంటూ స్థానిక బస్టాండ్ వద్ద చెప్పులు కుట్టే పని చేస్తూ కుటుంబాన్ని పోషించింది. కుమారుడు బీటెక్ పూర్తి చేశాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఆమెకు ఆసరాగా నిలుస్తున్నాడు.

వ్యవసాయం చేస్తూ... కొడుకును చదివించి



కేసముద్రం: వసాయం చేస్తూ కుటుంబ పోషణతో పాటు కొడుకును ఉన్నత చదువులు చదివించి ప్రయోజకుడిని చేసి నలుగురికి ఆదర్శంగా నిలుస్తోంది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమీనాపురం గ్రామానికి చెందిన మద్ది భవాని. 2001 ఆగస్టు 11న వ్యవసాయబావి వద్ద భర్త రవీందర్‌రెడ్డి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. అత్తగారింటి వద్ద ఉన్న ఎకరం భూమి కౌలుకు ఇచ్చి, పుట్టింటికి వచ్చింది. తన తల్లి కమలమ్మకు తోడుగా ఉంటూ.. కట్నం కింద ఇచ్చిన ఎకరం భూమిలో ఆమె స్వయంగా వ్యవసాయం చేయడంతోపాటు ఇతరులకు కూలీ పనులకు వెళ్లి కొడుకును చదివించింది. కొడుకు రాకేష్ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు. భర్త చనిపోయినా ఏనాడు కుంగిపోకుండా కొడుకును ప్రయోజకుడిని చేసి ఆదర్శంగా నిలుస్తోంది.

సమానత్వం సామాజిక బాధ్యత

- మహిళలపై హింస, ఇతర నేరాలపై కఠిన శిక్షలు
- 'సాక్షి' చర్చా వేదికలో వాగ్దేవి ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల మనోగతం

కుమార్తె చాలు

- ఆడపిల్లే కావాలంటున్న తల్లిదండ్రులు
- ఉన్నత స్థానంలో ఉంచేందుకు ప్రయత్నం

- వివరాలు 10లో▸

మంత్రి సీతక్క కాన్వాయ్ అడ్డుకునే ప్రయత్నం

కొండా సురేఖ అనుకుని బీఎస్పీ శ్రేణుల నిరసన

జనగామ: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ పార్టీ శ్రేణులు గురువారం జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తాలో మంత్రి సీతక్క కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. జనగామలో జరిగిన అనాథ వృద్ధాశ్రమం ప్రారంభోత్సవంలో పాల్గొని తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో బీఎస్పీ కార్యకర్తలు ప్లకార్డులతో కాన్వాయ్‌కి అడ్డుగా వచ్చారు. అయితే రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకున్నాడని ఇటీవల మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆపార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. మంత్రి సీతక్కను.. కొండ సురేఖగా భావించిన నాయకులు కాన్వాయ్‌కి అడ్డురాగా.. పోలీసులు వారిని బలవంతంగా లాక్కెళ్లారు.



బీఎస్పీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



సాక్షి గెస్ట్ ఎడిటర్

రిపోర్టర్ రాసిన వార్తను చదువుతున్న 'సాక్షి' గెస్ట్ ఎడిటర్, హనుమకొండ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి కొండపల్లి మధురిమ

వార్తలు చదివి.. సూచనలిచ్చి

ఎడిటింగ్.. శీర్షికల రచనలో మెళకువలు

- సమస్యకు పరిష్కారం చూపే విధంగా కథనాలు ఉండాలి
- జర్నలిజంలో మహిళలను ప్రోత్సహించాలి
- 'సాక్షి'గెస్ట్ ఎడిటర్, హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి కొండపల్లి మధురిమ



పేజీ లే అవుట్‌లో సలహాలు ఇస్తున్న సాక్షి గెస్ట్ ఎడిటర్




ప్రింటింగ్ సెక్షన్‌లో సాక్షి కాపీని పరిశీలిస్తున్న గెస్ట్ ఎడిటర్ మధురిమ

హన్మకొండ అర్బన్: క్షేత్రస్థాయినుంచి వచ్చిన వార్తలను చూసి.. ఎడిటింగ్, అదనపు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.. సాక్షి గెస్ట్ ఎడిటర్, హనుమకొండ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి కొండపల్లి మధురిమ. వరంగల్ సాక్షి యూనిట్ కార్యాలయానికి గురువారం గెస్ట్ ఎడిటర్‌గా వచ్చిన ఆమె క్షేత్రస్థాయి నుంచి వార్తలు పరిశీలించారు. మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షి ఇస్తున్న ప్రత్యేక కథనాల కాపీలను చదివారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలపై ఇచ్చిన కథనాల్లో ప్రచురించదగిన వాటిని ఎంపిక చేశారు. కథనాలు, శీర్షికల్లో తన సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం సబ్ ఎడిటర్లు దిద్దుతున్న కాపీలను పరిశీలించారు. అదే విధంగా పేజీ లే అవుట్‌ను గమనించి గణాంకాలను గ్రాఫ్ పద్ధతిలో ఉండేలా చూసుకుంటే ఆకట్టుకునే విధంగా ఉంటుందని సూచన చేశారు. అనంతరం యూనిట్‌లోని ఐటీ విభాగం, ఏడీపీటీ, సీటీపీ, ప్రింటింగ్ విభాగాలను పరిశీలించి ఆయా విభాగాల పనితీరును తెలుసుకున్నారు. పత్రికల్లో వార్తా కథనాల విషయంలో తన అనుభవాలు వివరించారు.

పాఠకులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వార్తలు

పాఠకులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వార్తలు ఉండాలని సాక్షి గెస్ట్ ఎడిటర్, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ సూచించారు. వార్తలు సుత్తి లేకుండా, పాఠకులను అయోమయానికి గురి చేయకుండా రాయాలని, ఇన్వెస్టిగేటివ్ జర్నలిజాన్ని ప్రోత్సహించాలన్నారు. పాఠకుడి చేతికి పత్రిక చేరాలంటే దాని వెనుక అనేక మంది శ్రమ, కృషి ఉంటుందని, స్వయంగా తాను పరిశీలించాక తెలిసిందన్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ అనుకున్న సమయానికి పత్రిక పాఠకుడికి చేరవేయడం అభినందనీయమన్నారు. మహిళలను జర్నలిజంలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అతిథిగా వచ్చే అవకాశం తనకు రావడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు ఆమెకు 'సాక్షి'ఎడిషన్ ఇన్‌చార్జ్ వర్దెల్లి లింగయ్య ఇతర సిబ్బంది శాలువా, పుష్పగుచ్ఛం అందజేశారు.

నేడు మహాశివరాత్రి



విద్యుత్ వెలుగుల్లో సోమేశ్వరాలయం



శివరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు

- అర్ధరాత్రి 12 గంటల తర్వాత లింగోద్భవం
- ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు
- ఆలయాల్లో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

జనగామ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారు జామున 4.30 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో జిల్లాలోని అన్ని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సిద్ధులగుట్ట, పాతబీటు బజారు శ్రీరామలింగేశ్వర స్వామి, చీటకోడూరు, పట్టణంలోని బతుకమ్మకుంట దుర్గామాత తదితర ఆలయాల్లో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం, అర్ధరాత్రి 12 గంటల తర్వాత లింగోద్భవ సమయంలో శివలింగానికి అభిషేక పూజలు చేయనున్నారు.

బ్రహ్మోత్సవాలు షురూ

పాలకుర్తి టౌన్/బచ్చన్నపేట : పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహాశివ రాత్రి జాతర బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. అలాగే.. బచ్చన్నపేట మండల పరిధి కొడవటూరు శ్రీ సిద్దేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు... / మహా శివరాత్రి శుభాకాంక్షలు...

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు



హన్మకొండ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల కోసం ప్రముఖ శైవ క్షేత్రాలకు 259 ప్రత్యేక బస్సులు నడపుతున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాన్సి శ్రీలత గురువారం తెలిపారు. ఈ నెల 8, 9న కాళేశ్వరం, వేములవాడ, పాలకుర్తి, రామప్పకు ప్రత్యేకంగా బస్సులు నడపనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వివరించారు. భూపాలపల్లి డిపో హనుమకొండ నుంచి కాళేశ్వరానికి 30బస్సులు, వరంగల్ వన్ డిపో ద్వారా హనుమకొండ నుంచి పాలకుర్తికి ఎనిమిది బస్సులు, తొర్రూరు డిపో నుంచి పాలకుర్తికి 12బస్సులు, మహబూబాబాద్ డిపో నుంచి కురవికి 15బస్సులు, జనగామ డిపో నుంచి కొమురవెల్లికి 20బస్సులు, హనుమకొండ డిపో ద్వారా మెట్టుగుట్టకు మూడు బస్సులు, వరంగల్-2 డిపో ద్వారా హనుమకొండ నుంచి రామప్పకు 15 బస్సులు, హనుమకొండ డిపో ద్వారా హనుమకొండ నుంచి వేములవాడకు 30బస్సులు, నర్సంపేట డిపో నుంచి వేములవాడకు పది బస్సులు, పరకాల డిపో నుంచి వేములవాడకు 8ప్రత్యేక బస్సులు నడపుతున్నట్లు వివరించారు. హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు వేములవాడకు బయల్దేరుతుందని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా కాళేశ్వరం, రామప్ప, పాలకుర్తికి హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి బస్సులు నడపనున్నట్లు వివరించారు.

సమానత్వం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ యాదవ్



సాక్షి చర్చావేదికలో పాల్గొన్న విద్యార్థినులు

మహిళలపై హింస, ఇతర నేరాలపై కఠిన శిక్షలు

- వివక్ష లేకుండా ఉన్నత చదువులు
- ప్రభుత్వాలు నూతన రక్షణ చట్టాలు తేవాలి
- కళాశాల, పని చేసే ప్రదేశం, ప్రయాణాల్లో రక్షణ కల్పించాలి
- 'సాక్షి' చర్చా వేదికలో వాగ్దేవి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల విద్యార్థుల మనోగతం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

'సమానత్వం సామాజిక బాధ్యత అని ప్రతి ఒక్కరు గుర్తించాలి. ఆదిశగా ప్రతీ ఇంట్లో చర్చ జరగాలి' అని విద్యార్థులు అంటున్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' మీడియా, వాగ్దేవి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చర్చా వేదిక నిర్వహించారు. 'ఆడపిల్లలపై వివక్ష-దీటుగా ఎదుర్కోవడం' అంశంపై ఫార్మసీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎం.శ్వేత, స్వర్ణలత, సుప్రజ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు తమ అభిప్రాయాలు వ్యక్తపర్చారు. లింగ వివక్షలేని సమాజ నిర్మాణం, మహిళలపై అఘాయిత్యాలు, దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు మరింత కఠిన చట్టాలు తేవాలని కొందరు.. ఆత్మరక్షణ కోసం చిన్నతనం నుంచే శిక్షణ ఇవ్వాలని మరికొందరు, ఇప్పుడున్న చట్టాలకు ప్రభుత్వాలు మార్పు తేవాలని ఇంకొందరు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ చర్చావేదికకు ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కమల్‌యాదవ్ హాజరై మాట్లాడుతూ మహిళలపై ఇంటాబయట వివక్ష పోవాలని, రోజురోజుకూ చిన్నారులు, యువతులపై పెరుగుతున్న దాడులను అరికట్టి, కఠిన శిక్షలు విధించాలన్నారు.

-ఖిలా వరంగల్

ఎందులోనూ తక్కువ కాదు



అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. పురుషులతో సమానంగా ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో దూసుకెళ్తున్నారు. ఆడపిల్లలకు స్వేచ్ఛగా చదువుకుని నచ్చిన ఉద్యోగం చేసుకునే అవకాశం కల్పించాలి. చిన్ననాటి నుంచే మంచి విద్య అందించాలి. ఎంచుకున్న రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహం ఉండాలి.

-సీహెచ్.ప్రవళిక, ఫార్మ్ థర్డ్ ఇయర్ విద్యార్థి

సమాజంలో మార్పు రావాలి.



సమాజంలో ఇంకా ఎంతో మార్పు రావాలి. సమాజంలో ఆడవారిపై వివక్ష తగ్గాలి. మగవారితో సమానంగా ఆడవారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలి. ఆధునిక యుగం నుంచి సాంకేతిక యుగానికి వృద్ధి చెందాం. నేరాల తగ్గుదలకు కఠిన శిక్షలు, చట్టాలు చేయాలి. ఆత్మస్థైరాన్ని పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

- సాన్యా మహీ, ఫార్మ్ డీ ఫోర్త్ ఇయర్

చదువుతోనే సాధికారత



నేను నాభర్త ప్రోత్సాహంతో విద్యలో రాణించాను. ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. మా ఇంట్లో ఇద్దరు పిల్లలకు సమానావకాశాలు కల్పిస్తున్నాం. ప్రతీ మహిళ స్వేచ్ఛగా బతకాలి. స్థిరమైన ఆలోచనలు కలిగి ఉండాలి. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి.

- ఎం.స్వాతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, వాగ్దేవి కళాశాల

తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలి..



ప్రతి ఇంట్లో ఆడపిల్లలకు మంచి విద్యను అందించాలి. ఎంచుకున్న రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలి. ఇంట్లో ఆడ, మగ వ్యత్యాసం చూపకూడదు. ప్రతీ అమ్మాయిలో మనోధైర్యం, మానసిక స్థైర్యం పెంచేలా తల్లిందండ్రులు కృషి చేయాలి.

- బి.చందన, విద్యార్థిని

పకడ్బందీగా చట్టాలు అమలు చేయాలి..



సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. ప్రభుత్వాలు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. కళాశాలలు, పని చేసే చోట, ప్రయాణాల్లో జరుగుతున్న దాడులను అరికట్టాలి. మహిళలు స్వేచ్ఛగా, భయం లేకుండా రోడ్లపై తిరిగేలా చర్యలు తీసుకోవాలి.

- టి.సమత, ఫార్మ్ డీ ఫైనల్ ఇయర్

కొత్త చట్టాలతోనే మహిళలకు రక్షణ



బాలికలు, మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలు, నేరాలను అరికట్టాలంటే కఠినమైన కొత్త చట్టాలు తీసకొచ్చి పకడ్బందీగా అమలు చేయాలి. పోలీసు యంత్రాంగం కూడా చిత్తశుద్ధితో పని చేయాలి. మరో వైపు సమాజంలో కూడా మార్పు రావాలి. ప్రతి ఒక్కరూ మహిళలపై గౌరవంగా వ్యవహరించాలి.

- జదుపుల వర్షిణి, ఫార్మ్ డీ సెకండ్ ఇయర్

మానాన్న బాధపడలేదు



మేం ఇద్దరం ఆడపిల్లలం. నేను చిన్నదాన్ని. మా అమ్మానాన్న ఎన్నడూ మగపిల్లాడు పుట్టలేదని బాధపడలేదు. ఆడపిల్ల అయినంత మాత్రాన ఎందులోనూ తక్కువ కాదు. ఏసమయంలోనైనా.. అధైర్యపడొద్దని చెప్పేవారు. ఎవరైనా అడిగినప్పుడు కొడుకు ఏం గొప్ప కాదని చెప్పినప్పుడు కూతుళ్లుగా మాకు ఎంతో గర్వంగా అనిపిస్తుంది.

- శ్రీరామ రోహిణి, ఫార్మ్ డీ ఫోర్త్ ఇయర్

ఇంట్లో ఆడ, మగ వివక్ష తగ్గాలి..



సమాజంలో మగవారితో ఆడవాళ్లను సమానంగా చూడడం లేదు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నా.. ఆడపిల్ల పుడితే బరువుగా భావిస్తున్నారు. తల్లిదండ్రులు వివక్ష వీడి గొప్ప మహిళలను ఆదర్శంగా తీసుకోవాలి. ప్రస్తుతం మనం కొత్త ఆలోచనలతో అద్భుతాలు సాధించే దిశగా అడుగులు వేస్తున్నాం. దీనికి ఎవరి ప్రమేయం, ప్రోద్బలం లేకుండా స్వతంత్రంగా ఎదుగుతున్నాం. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే మగవారికి దీటుగా విజయాలు సాధిస్తాం.

-డి.స్వాతి, ఫార్మ్ డీ ఫోర్త్ ఇయర్

చట్టాల్ని కఠినంగా అమలు చేయాలి



మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా.. వాటి అమలు తీరు కఠినంగా ఉండాలి. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు చూస్తే భయం వేస్తోంది. ఏదైనా ఘటన జరగ్గానే రాజకీయ జోక్యం ఉండకుండా చట్టాలను అమలు చేస్తే నేరాలు తగ్గుతాయి. చట్టాల పటిష్ఠ అమలుతో ప్రయోజనం దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి.

- సుప్రజ, అసిస్టెంట్ ప్రొఫెసర్,వాగ్దేవి కళాశాల

మహిళా శక్తిని గుర్తించాలి



తమ కాళ్ల మీద తాము నిలబడాలనే లక్ష్యంగా.. చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకున్నా. అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయికి ఎదిగా. మహిళలు.. పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. మహిళాశక్తిని సమాజం గుర్తించాలి. వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి సహకరిస్తే చాలు సమానత్వం సాధించే దిశగా అడుగులు పడతాయి. ప్రతీ తల్లిదండ్రులు సమాజంలో బతికే విధానంపై పిల్లలకు అవగాహన కల్పించాలి.

- స్వర్ణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్, వాగ్దేవి కళాశాల

మహిళలకు సంపూర్ణ స్వేచ్ఛనివ్వాలి..



మా అమ్మానాన్నలకు ముగ్గురు కూతుళ్లం. మగవారికి దీటుగా ఎదగడమే నాలక్ష్యం. నా చిన్ననాటి నుంచి సమాజంలో ఆడ, మగ వివక్ష చూస్తున్నాం. సాంకేతికత వృద్ధి చెందింది. అయినా.. మారుమూల గ్రామాల్లో అమ్మాయిలు ఇబ్బంది పడుతున్నారు. చట్టాల్లో మార్పులు తేవాలి. తల్లిదండ్రులు అబ్బాయిలకు ఇచ్చే స్వేచ్ఛ అమ్మాయిలకూ ఇవ్వాలి.

-పావని, ఫార్మ్ డీ థర్డ్ ఇయర్

కూతురు చాలు



తొలిసంతానంలో కుమార్తె లేదా.. కుమారుడు ఎవరు జన్మించినా.. మరో సంతానం కోసం ఎదురుచూడడం సాధారణం. కానీ, ఒక కుమార్తె జన్మించగానే ఇక పిల్లలు వద్దనుకుని, ఆడపిల్ల ఎందులోనూ తక్కువకాదనే అభిప్రాయం కలిగిన తల్లిదండ్రులు కూడా ఉన్నారు. కుమార్తెను తాను ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థానంలో ఉండేలా తీర్చిదిద్దడం కోసం శ్రమిస్తున్న తల్లిదండ్రులు అనేకమంది మనలోనే ఉన్నారు. అలాంటి తల్లిదండ్రుల అభిప్రాయలు.. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా.. సాక్షి పాఠకుల కోసం.

అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యం



కుమార్తెను చదివిస్తున్న తల్లిదండ్రులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన హరిదాస్యం సుదర్శన స్వామి పూర్ణిమకల్యాణి దంపతులకు ఒకే కుమార్తె. పేరు మహతి.. ఏడో తరగతి చదువుతుంది. చదువుతోపాటు భారతనాట్యం, కూచిపూడి నేర్పిస్తున్నారు. ఈక్రమంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు కూడా అందుకుంది మహతి. ఆడపిల్ల అని ఏనాడు తక్కువ చేయలేదని, ఆమెను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉన్నామని చెబుతున్నారు.. మహతి తల్లిదండ్రులు సుదర్శనస్వామి దంపతులు.

కూతురే ప్రాణం..!!



తల్లిదండ్రులతో అంజనారావు

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన పేరాల హరీశ్‌రావు- కల్పనది ప్రేమవివాహం. వీరి కుమార్తె అంజనారావును అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. ఆడపిల్లపై ప్రేమతో మరోసంతానం వద్దనుకున్నారు. ఒక్కగానొక కుమార్తెను బాగా చదివించాలని నిర్ణయంచుకున్నారు. కుమార్తెను ఐపీఎస్‌ను చేయడమే లక్ష్యం అంటున్న ఈ తల్లిదండ్రులు కుమార్తెకు కరాటేలో సైతం శిక్షణ ఇప్పిస్తున్నారు.

ఒక్కరితో స్ఫూర్తిగా నిలిచారు



తల్లిదండ్రులతో సుష్మ

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు కొరివి సుధాకరాచారి, హైమావతిల ఏకైక సంతానం సుష్మ. కూతురు పుట్టకముందు ఈ దంపతులు ప్రైవేటు ట్యూషన్లు చెప్పి కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. 1994లో సుష్మ జన్మించిన రెండేళ్లకే సుధాకరాచారికి, హైమావతి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. జనాభా నియంత్రణపై అవగాహన ఉన్న ఈ విద్యావంతులు ఒక కుమార్తెతోనే సరిపెట్టుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఏకైక కూతురిని ఇంజనీరింగ్, ఎంబీఏ చదివించి ఉత్తమ పౌరురాలిగా తీర్చిదిద్ది పలువురికి స్ఫూర్తిగా నిలిచారు.

పాపనే మాకు అన్నీ..



సుధాకర్-కమలతో కుమార్తె వర్షిణి

టేకుమట్ల: మా పాప వర్షిణి 2007లో జన్మించింది. పాపే మాకు అన్నీ. ఒక్కపాప చాలనుకున్నాం. పాప, బాబు అనే తేడా లేకుండా చూసుకుంటున్నాం. సమాజంలో ఇప్పటికీ లింగ వివక్షత ఉంది.. అది సరికాదు. సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అలాంటప్పుడు వేర్వేరుగా కాకుండా పాపనే అన్నిరంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలనే మా అభిప్రాయం.

- పెంట సుధాకర్- కమల దంపతులు

కుమార్తె వారసుడిగా..



తల్లిదండ్రులతో చందన ప్రియ

చెన్నారావుపేట: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య-లత దంపతులకు 2022లో కుమార్తె చందనప్రియ జన్మించింది. సమాజంలో ఆదర్శంగా ఉండాలనే ఆలోచన, మంచి మెసేజ్ ఇవ్వడం కోసం కుమార్తె పుట్టగానే పిల్లలు కాకుండా ఆపరేషన్ చేయించుకున్నారు. కుమార్తెను వారసుడిగా.. ఉన్నతంగా చదివించి డాక్టర్‌గా సమాజసేవలో నిమగ్నం చేయాలనుకున్నారు. ఈక్రమంలో ఎంబీబీఎస్ సీటు సాధించి తల్లిదండ్రుల కల నెరవేర్చింది చందన ప్రియ.

చిన్నచూపు తగదు..



తల్లిదండ్రులు, భర్తతో జ్యోతి

నల్లబెల్లి: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన ఉప్పునూతుల లక్ష్మి-రవీందర్ దంపతులకు కుమార్తె జ్యోతి జన్మించగా.. ఇక పిల్లలు వద్దని నిర్ణయించుకున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఓర్చుకుని ఎంబీబీఎస్ పూర్తి చేయించి సమీప బంధువైన శ్రీకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. జ్యోతి తన తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ భర్త ప్రోత్సాహంతో గతేడాది ప్రభుత్వ డాక్టర్‌గా ఎంపికైంది. ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదని, వారిపై చిన్నచూపు తగదని అంటున్నారు.. జ్యోతి తల్లిదండ్రులు.

కూతురు చాలనుకున్నాం..



వర్ణికతో కల్పనా కృష్ణమూర్తి దంపతులు

బచ్చన్నపేట: మండలకేంద్రానికి చెందిన మడిశెట్టి కృష్ణమూర్తి కల్పన దంపతులు ఒక సంతానం చాలనుకున్నారు. కృష్ణమూర్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, కల్పన గృహిణి. నేటి సమాజంలో కూతురైనా కొడుకైనా ఒక్కటేనని మంచి విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూతురిని కొడుకులా పెంచుతున్నామని అంటున్నారు. కూతురు వర్ణిక ప్రస్తుతం హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. అనంతరం విదేశాలలో ఎమ్మెస్ చదివించి, పలువురికి ఆదర్శంగా నిలువడమే తమ లక్ష్యమంటున్నారు.. ఈదంపతులు.

కూతురికే పరిమితం



రష్మితో తల్లిదండ్రులు

దేవరుప్పుల : జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన మర్రి శోభ, నర్సింహారెడ్డికి ఆర్థిక స్తోమత కలిగినప్పటికీ లింగ వివక్షత విడనాడాలనీ, కొడుకుతోనే వంశం పోదనే సంకేతాన్ని ఇచ్చేలా 1993లో జన్మించిన ఒక్క కూతురు రష్మితోనే సరిపుచ్చుకున్నారు. ఉన్నత చదువులు చదివించి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందేలా తోడ్పాటు అందించారు. ఇంటికి పురుషుడు ఉంటేనే వంశం అనేది తప్పని, పుట్టిన కూతురు మెట్టింటికి వెళ్లినా వారికి కలిగే పిల్లల్లోనే వంశం ఉంటుందనే భావన కలిగినప్పుడు స్త్రీ, పురుష లింగ వివక్షత నిర్మూలన సాధ్యమన్నారు.